క్లుప్తంగా

ప్రత్తిపాడు ఈవోపీఆర్డీగా ఆదం షఫీ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల ఈవోపీఆర్డీగా షేక్ ఆదం షఫీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న జి.రవికుమార్ మే నెలలో ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా క్రోసూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న షఫీని ప్రత్తిపాడు మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఈవోపీఆర్డీగా మండలంలో బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో కె.శివపార్వతి సోమవారం తెలిపారు.

పశు బీమా నమోదు చేయాలి

ప్రత్తిపాడు: పాడి రైతులు తమ పశువులకు పశు బీమా నమోదు చేయించుకోవాలని గొట్టిపాడు పశు వైద్యశాల డాక్టర్ కేవీఎస్ నందకిషోర్ తెలిపారు. గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గేదెల కళేబరాలను వైద్యాధికారి పరిశీలించారు. పాడి రైతులు తమ జీవనాధారమైన పశువులను మేతకు వదిలినప్పుడు పశువులపై కచ్చితంగా వ్యక్తిగత పర్యవేక్షణ ఉంచాలన్నారు. అదే విధంగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని రైతులకు సూచించారు.

పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ



పొన్నూరు: మండల ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 9 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవిన్యూ 5, ఇరిగేషన్ 1, సర్వేకు సంబంధించి 3 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ వెంటనే చేయించాలి



పొన్నూరు: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 29 గ్రామాల్లో 20,604 రైతులు ఉన్నారని.. వారిలో 18,506 మంది రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదై ఉన్నారని తెలిపారు. 9,068 రైతులు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 8,659 మంది ఈకేవైసీ చేసుకున్నారని, 365 మంది రైతులు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ పూర్తి చేస్తేనే ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఆధార్ వివరాలతో సరిచూసుకుని వెంటనే పెండింగ్ ఉన్నవారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఏవో కోరారు.

మహిళలంతా ఐక్యంగా పోరాడాలి



కాకుమాను: సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళలంతా ఐక్యంగా పోరాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ అన్నారు. పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఐద్వా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై రోజు రోజుకు దాడులు, సామూహిక అత్యాచారాలు అధికమవుతున్నాయని అన్నారు. వీటిని పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రతి మహిళా ముందుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, భువనేశ్వరి, లక్ష్మీ, ఫర్వీన్, పార్వతి, శ్రావణి, పాల్గొన్నారు.

సీపీఐ 8వ డివిజన్ మహాసభ

లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలతో పేద ప్రజలు నష్టపోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు పాతగుంటూరు 8వ డివిజన్ శాఖ మహాసభ డివిజన్ నాయకులు కట్టా శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు

పింఛనో రామచంద్రా!

- ఆరు నెలలుగా పింఛన్ ఇవ్వకుండా వేధింపులు
- కొండేపాడు వైఎస్సార్ సీపీ సానుభూతి పరులపై అధికారులు టార్గెట్
- 'డోర్ లాక్' పేరుతో పింఛను నిలిపివేత

ప్రత్తిపాడు: పింఛన్లకు అధికారులు రాజకీయ రంగు పులుముతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులే టార్గెట్‌గా 'అర్హత అనుమానం' పేరిట పింఛను పంపిణీ చెయ్యకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. ఆరు నెలలుగా పింఛను ఇవ్వకుండా డోర్ లాక్ పేరుతో తప్పుడు నివేదికలిస్తూ కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు. వివరాల్లోనికి వెళితే.. ప్రత్తిపాడు మండలం కొండేపాడు గ్రామానికి చెందిన పచ్చల శ్రీనివాసరావు, చుండూరు సాంబశివరావు, గొల్లపూడి వేణుగోపాల ప్రసాద్‌లు రకరకాల సమస్యలతో గత కొన్ని సంవత్సరాలుగా దివ్యాంగుల పింఛను పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత మీ సర్టిఫికెట్లపై కొన్ని అభ్యంతరాలున్నాయని.. అర్హత లేదన్న సాకుతో గతేడాది అక్టోబరు, నవంబరు నెలల పింఛను ఇవ్వకుండా నిలిపివేశారు. తరువాత లబ్ధిదారులు డీఆర్‌డీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డిసెంబరు నెల పింఛను ఇచ్చారు. మరలా సదరం క్యాంప్‌నకు వెళ్లి పరీక్షలు చేయించుకుని, సర్టిఫికెట్లు తెచ్చుకుంటేనే పింఛన్ ఇస్తామని చెబుతూ ఈ ఏడాది జనవరి నుంచి పింఛను ఇవ్వకుండా నిలిపివేశారు.

పర్మినెంట్ మైగ్రేషన్‌లోకి..

జనవరిలో పింఛను నిలిపివేయడంతో లబ్ధిదారులు ఎంపీడీవోను కలిశారు. ఫిబ్రవరిలో సదరం టెస్ట్ ఉంది కదా.. అది పూర్తయిన తరువాత ఇస్తామని చెప్పారు. ఆ తరువాత మార్చి నెలలో కూడా ఇవ్వలేదు. ఇలా రకరకాల కారణాలు, సాకులూ చెబుతూ వరుసగా ఆరు నెలలు పింఛను పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారుల పింఛన్లు పర్మినెంట్ మైగ్రేషన్ లోనికి వెళ్లిపోయాయి. దీంతో ఇదేమని సెక్రటరీని, ఇతర అధికారులను లబ్ధిదారులు అడుగగా.. మరలా కొత్త పింఛనుకు దరఖాస్తు చేసుకోవాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. మధ్యలో అనేక సార్లు ఎంపీడీవోను కార్యదర్శిని కలిసి పింఛన్ల విషయమై అడిగామని.. మూడు నెలల పింఛను కలిపి ఒకేసారి ఇస్తామని మాట దాటేస్తూ వచ్చారని చెబుతున్నారు.



మండల అధికారులు పీజీఆర్ఎస్ ఫిర్యాదుకు రాసి పంపిన నివేదిక

కలెక్టర్‌కు సైతం తప్పుడు నివేదికలు..

పింఛను నిలుపుదలపై లబ్ధిదారులు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌లో పలు మార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టరు, ఉన్నతాధికారులకు ఏం సమాధానం చెప్పాలో అర్థంకాకా తప్పుడు నివేదికలు సమర్పించి ఉన్నతాధికారుల కళ్లకు అబద్ధాల గంతలు కట్టారు. అర్హత, అభ్యంతరాల విషయాన్ని పక్కనబెట్టి, పైముగ్గురూ అసలు గ్రామంలో నివాసమే ఉండడం లేదని, పింఛను పంపిణీకి వెళ్లిన సమయంలో డోర్ లాక్ ఉంటుందని జంకు లేకుండా అసత్యాలతో కూడిన నివేదికను పంచాయతీ కార్యదర్శి కలెక్టర్‌కు సమర్పించారు. మండల అధికారుల మౌఖిక ఆదేశాలతోనే పింఛను నిలిపివేశామని స్థానిక అధికారులు చెబుతున్నారని లబ్ధదారులు వాపోతున్నారు.

ఊరిలోనే ఉంటున్నా..



నేను మా ఊరిలో మా ఇంట్లోనే ఉంటున్నా. కానీ ఆరు నెలలుగా డోర్ లాక్ అని చెప్పి పింఛను ఇవ్వడం లేదు. మూడు సార్లు ఇప్పటికే పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాం. కనీసం గ్రామంలోనికి ఎంక్వైరీకి రావడం లేదు. ఎటూ నిగ్గు తేల్చడం లేదు. ఊర్లో ఉండడం లేదని కలెక్టర్‌కూ తప్పుడు నివేదికలు ఇస్తున్నారు.

పచ్చల శ్రీనివాసరావు, కొండేపాడు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



నాకు ఆరు నెలల నుంచి అనధికారికంగా పింఛను నిలుపుదల చేశారు. ఇదేమని ఎంపీడీవోను అడిగితే సర్టిఫికెట్లపై అభ్యంతరాలున్నాయన్నారు. గట్టిగా అడిగితే మూడు నెలలకు కలిపి ఒకేసారి ఇస్తామన్నారు. కానీ ఇవ్వకపోగా, ఇప్పుడు పర్మినెంట్ మైగ్రేషన్లోనికి వెళ్లాయని చెబుతున్నారు. ఇదెక్కడి న్యాయం. కలెక్టర్‌ను మూడు సార్లు కలిసి ఫిర్యాదులు చేశా. అయినా ఫలితం లేదు.

గొల్లపూడి వేణుగోపాలప్రసాద్, కొండేపాడు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పెదకాకాని: ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల స్థలాలు రెగ్యులర్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని గ్రామానికి చెందిన పలువురు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు సోమవారం అర్జీలను సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శికి అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణపురికాలనీ, శ్రీ లక్ష్మీ దుర్గ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్‌హోస్పరస్ కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలకు జీవో నెంబర్ 30 ప్రకారం రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బురదగుంట సాంబయ్య, కోటిపల్లి సత్యనారాయణ, సంకురి నీలాంబరం, సుందరయ్య కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో గుర్రపుడెక్క తొలగించాలి

పెదకాకాని: లక్షల మందికి మంచినీరు, వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువలో పేరుకు పోయిన గుర్రపుడెక్క, నాచును తక్షణమే తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని నుంచి గోళ్లమూడి వెళ్లే రోడ్డులో ఉన్న గుంటూరు ఛానల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. తక్షణమే గుర్రపు డెక్క తొలగించాలని, కాలువ కట్టలకు మరమ్మతులు చేపట్టాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సంకురి నీలాంబరం, సీఐటీయూ నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పు.. ప్రయాణానికి ముప్పు!



పాతమద్రాసు రోడ్డు ప్రమాదాలకు ఆనవాళ్లుగా మారుతోంది. నిత్యం ఎవరో ఒకరు రోడ్డు వెంబడి వ్యర్థాలకు పొగబెడుతుండటంతో ప్రజలు ప్రాణాలను అరచేతబట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తుంది. సోమవారం ఉదయం కోయవారి పాలెం సమీపంలో రోడ్డు వెంబడి పలు ప్రాంతాల్లో ఇలా వ్యర్థాలకు పెద్ద ఎత్తున నిప్పు పెట్టారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలూ పడ్డారు. ముక్కు మూసుకుని కొందరు, కళ్లు మూసుకుని మరికొందరు, ఎదురుగా ఏం వాహనాలు వస్తున్నాయో అర్థం కాక ఇంకొందరు ఇబ్బంది పడుతూ ప్రయాణించారు. ప్రయాణికుల అవస్థలు చూడలేక, ఎక్కడ ప్రమాదం బారిన పడతారోనని స్థానికులు బక్కెట్లతో నీటిని తెచ్చి మంటలు, పొగ ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ మార్గంలో ఇలా రోడ్ల వెంట పొగబెట్టడం, ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉండటం సాధారణమైపోయింది.

– ప్రత్తిపాడు

బాలుర వసతి గృహంలో అడ్మిషన్‌లు ప్రారంభం

కాకుమాను: స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహంలో 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత అడ్మిషన్‌లు ప్రారంభించినట్లు ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తెలిపారు. సోమవారం వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ.. సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో వసతి గృహాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అడ్మిషన్‌ల కోసం తెల్ల రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, విద్యార్థి, తల్లి పాస్‌పోర్టు ఫొటోలతో సంప్రదించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.విజయ్ భాస్కర్, వార్డెన్ తిరుపతిస్వామి పాల్గొన్నారు.

పాస్టర్ షాలేంరాజుపై చర్యలు తీసుకోవాలి



పెదకాకాని: సామాజిక మాధ్యమాల ద్వారా మహిళల ఆత్మగౌరవం, ఆచార వ్యవహారాలను కించపరచిన వ్యక్తిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని హిందూ ఐక్య పోరాట వేదిక సభ్యుడు చింతా శంభునాద్ అన్నారు. హిందూ ఐక్య సంఘాలు, శివశక్తి, హిందూ ఐక్య పోరాట వేదిక సభ్యులు సోమవారం పెదకాకాని పోలీసు స్టేషన్‌లో పాస్టర్ షాలేంరాజుపై ఫిర్యాదు చేశారు. హైందవ సనాతన సాంప్రదాయంలో భాగంగా తలలో పూలు ధరించడాన్ని తప్పుబట్టిన ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు టి.శివశంకర్, డి.చింతయ్య, కె.వరప్రసాద్, మునగా గోపిచంద్, తూనుగుంట్ల రాజేష్, సీహెచ్ గోపికృష్ణ, హర్ష పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో సోమవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కళాంజలి కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఔత్సాహిక గాయనీ గాయకులు పాత, కొత్త గీతాలు ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, కళాంజలి కళావేదిక అధ్యక్షుడు తొట్టెంపూడి రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆరికపూడి సాంబశివరావు, అన్నదాన సమాజం మాజీ చైర్మన్లు మిరియాల ప్రసాదరావు, గోపి కుమార్ మాట్లాడారు.

సంతకాలు ఉన్నాయి.. అధికారులేరీ!

ప్రత్తిపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)పై కొందరు అధికారులు అదే నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారు. సోమవారం ఎప్పటిలానే అందరితో పాటు ఉదయాన్నే పది, పదకొండు గంటలకు హాజరవుతున్న అధికారులు ఆ తరువాత కొద్ది సేపు కూర్చుని, గ్రీవెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. మరి కొందరు మాత్రం గ్రీవెన్స్ ఛాంబర్‌లో కూర్చోకుండా బయట కాలక్షేపం చేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రీవెన్స్ ఛాంబర్‌లో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సోమవారం ఉదయం కూడా తహసీల్దార్ జి.కరుణకుమార్, ఎంపీడీవో కె.శివపార్వతి, ఎంఈవో–2 లీలారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యుత్‌శాఖ అధికారులు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. మిగిలిన కొన్ని శాఖల అధికారులు మాత్రం గ్రీవెన్స్‌కు హాజరైనప్పటికీ సంతకాలు పెట్టి బయట షికార్లు చేస్తుండటంతో, తహసీల్దార్ వారందరినీ ఛాంబర్‌లోనికి పిలిపించి గ్రీవెన్స్ సమయం ముగిసే వరకు అందుబాటులోనే ఉండాలని ఆదేశించారు.



గ్రీవెన్స్ ఛాంబర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఎన్జీ రంగ వర్సిటీ బోధనేతర సంఘం ఎన్నిక

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంఫారం సమావేశ మందిరంలో సోమవారం విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎం.శ్రీనివాసరావు వ్యవహరించారు. ప్యానల్ సభ్యులకు అధికారి శ్రీనివాసరావు ధృవపత్రాలు అందజేశారు. ప్యానల్ సభ్యుల ఎన్నికల్లో కె.వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సంగ ప్రెసిడెంట్‌గా కె.వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఇ.అశోక్, వైస్ ప్రెసిడెంట్‌గా టీవీ శిరామకృష్ణ, జనరల్ సెక్రటరీ ఎల్.సతీష్, జాయింట్ సెక్రటరీ ఎస్.జగదీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.మౌనిక, టెక్నికల్ సెక్రటరీ సయ్యద్ మహబూబ్ వలీ, కల్చరల్, గేమ్స్ సెక్రటరీ మోహన్, ట్రజరర్ శ్రీధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశ్వవిద్యాలయం అధికారులు, బోధనేతర సిబ్బంది, శాస్త్రవేత్తలు నూతన సభ్యులను ఘనంగా సన్మానించారు.



ఎన్నికైన సంఘం సభ్యులతో అధికారులు

ప్రభుత్వ పాఠశాలలో చేరాలంటూ ప్రచారం!



ప్రచార వాహనం వద్ద పద్మజారాణి, పిల్లలు

ప్రత్తిపాడు: మూసివేత దిశగా ఉన్న ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాల మూతబడకుండా ఉండేందుకు కొందరు గ్రామస్తులు ప్రయత్నం చేస్తున్నారు. మూడు నెలలుగా ఇంటింటికీ తిరుగుతూ, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. గత విద్యా సంవత్సరం వరకు నలుగురైదుగురు ఉన్న ఈ పాఠశాలలో, ప్రస్తుతం ఇరవై మందికిపైగా విద్యార్థులను చేర్పించారు. ఇప్పుడు తాజాగా ప్రైవేటు పాఠశాలలకు తీసిపోకుండా, పిల్లలు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మజారాణి తన సొంత ఖర్చులతో విద్యార్థుల రాకపోకల నిమిత్తం స్కూలుకు వాహనాన్ని ఏర్పాటు చేశారు. రోజూ ఊరి చివరన ఉన్న ముస్లిం కాలనీ నుంచి పిల్లలను ఈ వాహనంలో బడికి తీసుకువచ్చి, తీసుకువెళుతున్నారు. పద్మజా రాణితో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారాయణ, గ్రామపెద్దలు బడి మూతపడకుండా మూడు మాసాలుగా తమ వంతుగా కృషి చేస్తున్నారు. రండీ.. మన ఊరిలో మన ప్రభుత్వ బడిలో మీ పిల్లలను చేర్పించండంటూ ఆటోల ద్వారా ప్రచారం చేయిస్తూ, కరపత్రాలు పంచుతూ నిత్యం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు.

విధుల్లో ఉద్యోగుల అలసత్వం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు హౌసింగ్ సిబ్బందిని అలసత్వపు జబ్బు పట్టిపీడిస్తోంది. కార్యాలయం ఎప్పుడు తెరిచి ఉంటుందో.. ఎప్పుడు మూసి ఉంటుందో.. తెలియని పరిస్థితి నెలకొంది. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వీరి అలసత్వంపై ఆ శాఖ పీడీ సైతం హెచ్చరికలు జారీ చేసినా వారి తీరులో మాత్రం ఏమీ తేడా కనిపించడం లేదు. సోమవారం ఉదయం 11.50 గంటల వరకూ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు. తాపీగా, తీరిగ్గా మధ్యాహ్నం 12 గంటల తర్వాత సిబ్బంది కార్యాలయానికి వచ్చి తలుపులు తీశారు. ఇది ఈ ఒక్క రోజు పరిస్థితి కాదు. నిత్యం ఈ కార్యాలయం పనితీరు ఇదే తంతుగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తే కానీ సిబ్బంది తీరులో మార్పు కనిపించేలా లేదని ప్రజలు వాపోతున్నారు.



సోమవారం ఉదయం 11.50 గంటలకూ తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం

సమర్థంగా విధులు నిర్వర్తించాలి

ప్రత్తిపాడు: విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు సమర్థవంతంగా విధులను నిర్వర్తించాలని ఎంఈవో సీహెచ్ రమాదేవి అన్నారు. మండలంలోని కోయవారిపాలెం, తిమ్మాపురం పాఠశాలల్లో ఎంటీఎస్ టీచర్లుగా పనిచేస్తున్న బి.సుజాత ఏటుకూరు క్లస్టర్‌కు, వి.సువర్ణరత్నకుమారి ఎడ్లపాడు క్లస్టర్‌కు బదిలీ అయ్యారు. వీరికి ఎంఈవో రిలీవింగ్ ఆర్డర్లు అందించారు. అదే విధంగా వారి స్థానంలో వేమూరు మండలం నుంచి ప్రత్తిపాడు క్లస్టర్‌కు పి.కల్యాణలక్ష్మి, కొల్లూరు మండలం నుంచి చినకోండ్రుపాడు క్లస్టర్‌కు బి.సీతాదేవి బదిలీపై వచ్చారు. వీరు సోమవారం మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో రమాదేవిని కలిసి జాయినింగ్ ఆర్డర్లు అందించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తే సత్ఫలితాలు ఉంటాయని తెలిపారు.



ఆర్డర్ కాపీలను అందిస్తున్న ఎంఈవో

విజ్ఞాన్ లారాలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

చేబ్రోలు: మెడికల్ రంగంలో ఆధునిక పదార్థాల వాడకం ద్వారా కృత్రిమ అవయవాలు, డెంటల్ ఇంప్లాంట్లు, బోన్ ప్లేట్స్ వంటి వాటిని శరీరానికి అనుకూలంగా తయారు చేయడం ఇప్పుడు సాధ్యమవుతోందని జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలలో 'అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాసెస్' అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో ఖచ్చితత్వంతో కూడిన వస్తు తయారీ అనేది వైమానిక, ఖగోళ పరిశోధనల్లో ఎంతో అవసరమన్నారు. నానోపదార్థాల ఆధారంగా తయారవుతున్న నూతన బ్యాటరీలు, ఫ్లెక్సిబుల్ స్క్రీన్లు, స్మార్ట్ సెన్సర్లు తదితరాలు టెక్నాలజీని మరింత వేగవంతం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్, జేఎన్‌టీయూ కాకినాడ నుంచి కోఆర్డినేటర్, ఏపీఎంఈ ఎం.మధుసూదన ప్రసాద్, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ వి.గోపాల కృష్ణ

జేకేసీ కళాశాలలో క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఒలింపిక్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జేకేసీ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, వైస్ ప్రినిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్ పర్యవేక్షణలో పరుగు పందెం, ఆర్మ్ రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, దేహదారుఢ్యం, డాడ్జ్ బాల్, త్రోబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆంగ్ల అధ్యాపకురాలు పి.నాగసుశీల, ఫిజికల్ డైరెక్టర్లు తుమ్మల శ్రీనివాసు, ఎం.అనిల్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గౌరీశంకర్, డాక్టర్ వై.ప్రశాంతి, డాక్టక్ ఎన్. మాధవి, ఆర్. శ్రీనివాసరావు, రాహుల్, అజయ్‌బాబు, సీహెచ్ రామ్‌ప్రసాద్, డాక్టర్ కేవీఎల్ఎస్ అప్పలాచార్యులు, డేనియల్, రామకృష్ణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మురళీమోహన్, గోపీచంద్ అధ్యాపకులు

మహిళలను గౌరవించడం సమాజానికి గౌరవప్రదం

నగరంపాలెం: భారతీయ సాంస్కృతిక జీవన విధానంలో మహిళలకు అగ్రస్థానం ఇచ్చారని, వారిని గౌరవించడం సమాజానికి గౌరవప్రదమని ప్రముఖ విద్యావేత్త నిఘంటు నిర్మాత పెద్ది సాంబశివరావు అన్నారు. గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై సత్కార సభ నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న విశిష్ట మహిళలు ప్రముఖ న్యాయవాది, రచయిత్రి నల్లూరి రుక్మిణి, గాయత్రి మహిళా సంగీత సన్మండలి కార్యదర్శి ఎం వై.శేషురాణి, ప్రముఖ బుర్రకథ కళాకారిణి యడవల్లి శ్రీదేవిలను జ్ఞాపిక, సన్మాన పత్రాలతో సత్కరించారు. గుళ్లపల్లి సుబ్బారావు గత రెండు దశాబ్దాలుగా విద్యా, సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాలకు అందిస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. సభకు అర్థలపూడి నేహా అధ్యక్షత వహించారు. యడవల్లి శ్రీదేవి బృందం కల్యాణం బుర్రకథ అహుతులను అలరించింది. కార్యక్రమంలో ఎం.వేదవతి, గుళ్లపల్లి స్వాతి, గుళ్లపల్లి రాఘవేంద్రరావు, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఏఎన్‌యూ సైబర్ సెక్యూరిటీ అధ్యాపకుడు డాక్టర్ వీర రాఘవరావు పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ(స్టెప్–స్వశక్తి) ఆధ్వర్యంలో సోమవారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్, మహిళల అక్రమ రవాణా అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వీర రాఘవరావు మట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు తమ వ్యక్తిగత సమాచారాన్ని అందించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్స్ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సైబర్ క్రైం బాధితులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీం నంబరు 1930కు ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగాధిపతి రాజేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా యువత ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవడంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ విద్యార్థినులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, అన్ని రంగాల్లో ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.బాబు పాల్గొన్నారు.